www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 97 శుక్రవారం, ఆగస్టు 21, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

**- హాజరైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు**




**మహాబలిపురం,ఆగస్టు 20 :** హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు

మిగతా2లో...

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

**● దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు ● కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత ● పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**మహాబలిపురం,ఆగస్టు 20 :** కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్

మిగతా2లో...



## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

**- నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత**
**- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్**

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు.

మిగతా2లో...

### రాజీవ్ జయంతి సందర్భంగా
## కాంగ్రెస్ నివాళి

**వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం**
**ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ**




## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

**కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం**
**డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా కార్యక్రమం**
**కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం**




### 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు
## పరిష్కారం..

**కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం**
**ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు**
**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం**



**హైదరాబాద్,ఆగస్టు 20 :** 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్,

మిగతా2లో...



## పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

**నైపుణ్య శిక్షణ అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన**
**కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**హైదరాబాద్,ఆగస్టు 20 :** ఇటీవల స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీనంపై నెలకొన్న అపోహలకు మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కొందరు అపోహలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పాలిటెక్నిక్‌లను మరింత అప్‌గ్రేడ్ చేసి, విద్యార్థులకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతోనే వాటిని స్కిల్ యూనివర్సిటీ

మిగతా2లో...

## అర్థరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**



**సిద్దిపేట,ఆగస్టు 20 :** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

### తెలంగాణలో 22ఎ సెక్షన్
## దుర్వినియోగం

**రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ**



**హైదరాబాద్,ఆగస్టు 20 :** తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ం జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30? కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

మిగతా2లో...

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

**అందుకు తనను బాధ్యులు చేయడం తగదు**

**క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకోవాలన్న కొండా సురేఖ**



# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దుల ను ప్రభుత్వ ÷ళ్లై కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?బీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేదని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు.

## 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

(మొదటి పేజీ తరువాయి)

వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ÷ాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమ వుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి‘ అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు.

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

22ంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.

సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

**హైదరాబాద్,ఆగస్టు 20 :** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 :** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది.ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించుకున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యు వతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయా లు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ( సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధా నంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నా రు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారని పేర్కొన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని ప్రశంసించారు కర్ణాటక సీఎం డీకే శివకుమార్.

## పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ తెలంగాణ యువత ముందుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని, వారి సర్వీసు భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. డిప్యూటేషన్, బదిలీల విధానంలోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసినప్పటికీ పాలిటెక్నిక్ ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పాలిసెట్‌ను కూడా కొనసాగిస్తామని తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థు లు, లెక్చరర్లకు విలీనంతో మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు రూ.2 వేల స్టైఫండ్ అందించే అంశంపై కూడా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. వరంగల్‌లో విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకుని బదిలీ చేశామని తెలిపారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలిటెక్నిక్ కాలేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని ఆరోపించిన మంత్రి.. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. శక్తి శాఖ పేరును కార్మిక శాఖగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయని, శాఖ పేరులో 'కార్మిక' పదం కూడా ఉండేలా మార్పులు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు.

## భద్రాచలం ఐదు గ్రామాలు తెలంగాణలో కలపాలి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఆగస్టు 20 :**రాష్ట్ర విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలను కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నించింది.

గురువారం మహాబలిపురంలో కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు ప్రధాన అంశాలపై కేంద్రం, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఏపి వాటా నిధులు విడుదల చేయాలని, ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, భద్రాచలం, ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రాన్ని కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం పరిసరాల్లోని యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని తుమ్మల కోరారు.

ఈ ఐదు పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వాటి మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలు అన్నారు. 2024 జూలై 18న భారీ వర్షాలకు దెబ్బతిన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టును శాశ్వతంగా పునరుద్ధరించేందుకు రూ.92.20 కోట్లు అవసరమని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, మొత్తం ఆయకట్టులో 85.25 శాతం(13,640 ఎకరాలు) ఏపి పరిధిలోనే ఉందన్నారు.శాశ్వత పునరుద్ధరణ వ్యయాన్ని ఆయకట్టు నిష్పత్తి ప్రకారం రెండు రాష్ట్రాలు భరించాలని, ఏపీ తన వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని చంద్రబాబును కోరారు. గత ఫిబ్రవరిలోనే విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్ణయం పెండింగ్‌లో ఉందని, రైతుల ప్రయోజనాల

# బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో ముంపు ముప్పునకు చెక్ పెట్టేందుకు నాలాల విస్తరణ

- 12 మీటర్ల నుంచి 20 మీటర్ల వరకు నాలాల వెడల్పు.. అక్రమ నిర్మాణాల తొలగింపు
- మైసమ్మ చెరువు నుంచి దీన్‌దయాల్‌నగర్ వరకు పనులు ముమ్మరం
- చెరువులు--నాలాల అనుసంధానం మెరుగుపరిచి వరద నీటి ప్రవాహానికి మార్గం సుగమం






**బాలానగర్ ఆగస్టు 21 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్ పరిధిలో భారీ వర్షాలు కురిసిన సమయంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా జీహెచ్ఎంసీ నాలాల అభివృద్ధి, విస్తరణ పనులను ముమ్మరం చేసింది. వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం కింద చేపడుతున్న ఈ పనుల్లో నాలాల వెడల్పును పెంచడంతో పాటు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను తొలగిస్తూ వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. 12 మీటర్ల నుంచి 20 మీటర్లకు నాలాల విస్తరణ నాలా అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న నాలాలను ప్రాంతాన్ని బట్టి 12 మీటర్ల నుంచి 20 మీటర్ల వరకు విస్తరించేలా పనులు చేపడుతున్నట్లు సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో నాలాకు ఇరువైపులా 20 మీటర్ల వరకు విస్తరణ చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలు, నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగిస్తూ నాలాల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. ముంపు ప్రాంతాల్లో రక్షణ నిర్మాణాలు చేపట్టడంతో పాటు అవసరమైన చోట్ల నాలాల గోడలను బలోపేతం చేస్తున్నారు. మైసమ్మ చెరువు నుంచి దీన్‌దయాల్‌నగర్ వరకు పనులుకూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని మైసమ్మ చెరువు నుంచి దీన్‌దయాల్‌నగర్ వరకు గత నెల నుంచి నాలా అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. వరద నీరు వేగంగా వెళ్లేలా పలు ప్రాంతాల్లో నాలాలను విస్తరించడంతో పాటు పూడికతీత, ఆధునీకరణ పనులను కూడా చేపడుతున్నారు. జింకలవాడ ప్రాంతంలో నాలా విస్తరణ పనులు ప్రత్యేకంగా కొనసాగుతున్నాయి. నాలాకు ఇరువైపులా సుమారు 500 మీటర్ల మేర ఒక దశలో పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే జింకలవాడలోని కల్వర్టు కింది భాగంలో కూడా ఇరువైపులా సుమారు 500 మీటర్ల మేర నాలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. భరత్‌నగర్‌లోని మెట్రో రైలు స్టేషన్ సమీపంలో కూడా నాలాకు ఇరువైపులా సుమారు 500 మీటర్ల మేర అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**-- పట్టా భూముల విషయంలో ప్రజలతో చర్చించి చర్యలు.....**
జింకలవాడ పారిశ్రామిక ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో నాలా పరిధిలోని భూములు పట్టా భూములుగా ఉండటంతో ఆక్రమణలు, నిర్మాణాల విషయంలో స్థానిక ప్రజలతో శాంతియుతంగా చర్చిస్తూ పనులు చేపడుతున్నట్లు జీహెచ్ఎంసీ ఏఈ తెలిపారు.నిర్మాణాలకు సంబంధించి సరైన పత్రాలు లేని కొన్ని అక్రమ నిర్మాణాలను ఇప్పటికే తొలగించినట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిబంధనలను పాటిస్తూ నాలా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు.

**చెరువులు--నాలాల అనుసంధానానికి ప్రాధాన్యం**
కూకట్పల్లి నియోజకవర్గంలో వర్షపు నీరు నిలిచిపోకుండా ఉండేందుకు చెరువులు, నాలాల మధ్య అనుసంధాన వ్యవస్థను మరింత మెరుగుపరచడం ఈ పనుల్లో ప్రధాన అంశంగా అధికారులు పేర్కొన్నారు. చెరువుల నుంచి వచ్చే అదనపు నీరు నాలాల ద్వారా సాఫీగా దిగువ ప్రాంతాలకు చేరేలా ప్రవాహ మార్గాలను అభివృద్ధి చేస్తున్నారు. అదేవిధంగా నాలాల్లో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించడం, నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచడం, బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించడం వంటి పనులు చేపడుతున్నారు.

**-- భారీ వర్షాల సమయంలో ముంపు నివారణే లక్ష్యం........**
హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురిసినప్పుడు తక్కువ సమయంలో అధిక మొత్తంలో వర్షపు నీరు ప్రవహించడం వల్ల పలు ప్రాంతాల్లో ముంపు సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో నాలాల సామర్థ్యాన్ని పెంచి వరద నీటిని వేగంగా తరలించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ చర్యలు చేపడుతోంది. వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం కింద నాలాలు, వర్షపు నీటి కాలువలను విస్తరించడం, ఆధునీకరించడం, పూడికతీత పనులు చేపట్టడం, అవసరమైన చోట్ల రక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయడం వంటి పనులను ప్రాధాన్యతతో నిర్వహిస్తున్నారు.

**-- ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టి.......**
కూకట్పల్లి నియోజకవర్గంలో చేపడుతున్న నాలా విస్తరణ పనులు పూర్తయితే భారీ వర్షాల సమయంలో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకులు తగ్గి ముంపు సమస్యను గణనీయంగా నియంత్రించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా జింకలవాడ, భారత్‌నగర్, దీన్‌దయాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో నాలాల సామర్థ్యం పెరగడంతో స్థానిక ప్రజలకు ముంపు ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. నాలాల ఆక్రమణల తొలగింపు, వెడల్పు పెంపు, పూడికతీత, రక్షణ నిర్మాణాలు, చెరువులు--నాలాల అనుసంధానం మెరుగుదల వంటి చర్యలతో కూకట్పల్లి నియోజకవర్గాన్ని ముంపు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా జీహెచ్ఎంసీ పనులు కొనసాగుతున్నాయి.

# రామప్ప లోని ఇంటర్ ప్రిటేషన్ పనులను పరిశీలించిన టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్











**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20( పీపుల్స్ న్యూస్)**
మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయ తూర్పు ముఖ ద్వారం వద్ద నిర్మిస్తున్న ప్రసాద్ స్కీం లోని ఇంటర్ప్రిటేషన్ ఓపెన్ థియేటర్, తథితర పనులను గురువారం టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్ పరిశీలించారు ఇంటర్ప్రిటేషన్ సెంటర్ కు సందర్శించిన ఆయనకు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎం శివాజీ డి ఈ నటరాజ్ ఏఈ విజయకుమార్ లు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాద్, సాస్కి పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించి ఏ పనులు ఎంతవరకు పూర్తి చేశారని పూర్తి పనులు ఎప్పటిలాగా పుర్తి చేస్తారని పూర్తయిన తర్వాత భవిష్యత్తులో వీటిని పర్యాటకలకు ఏ విధంగా ఉపయోగపడతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో త్వరలో పూర్తి చేయాలని పర్యాటకులకు అందుబాటులో తీసుకురావలని అధికారులకు సూచించారు. అనంతరం లక్నవరం, ఘనపురం కోటగుల్ల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వారి వెంట ఏఈ కీర్తి, లోకేష్, టూరిజం గైడ్స్ గోరంట్ల విజయ్ కుమార్, వెంకటేష్, సిబ్బంది, టూరిస్ట్ పోలిసులు, టూరిజం కార్పొరేషన్, బోటింగ్ సిబ్బంది, తథితరులు ఉన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం: బండి రమేష్

- సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారు
- బాలానగర్‌లో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**బాలానగర్ ఆగస్టు 21 ( పీపుల్స్ న్యూస్)**
భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ముఖ్యంగా దేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారని పేర్కొన్నారు. నేడు భారతదేశం ప్రపంచ స్థాయిలో ఐటీ రంగంలో అగ్రగామిగా ఎదగడానికి ఆయన తీసుకున్న దూరదృష్టితో కూడిన నిర్ణయాలు ఎంతో దోహదపడ్డాయని తెలిపారు.భారతదేశం నేడు ఐటీ ఎగుమతుల రంగంలో ఏటా సుమారు రూ.19.2 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే స్థాయికి చేరుకోవడంలో రాజీవ్ గాంధీ ప్రారంభించిన సాంకేతిక ప్రగతి కీలక పునాదిగా నిలిచిందని బండి రమేష్ పేర్కొన్నారు. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ దేశాభివృద్ధి, యువత సంక్షేమం, సాంకేతిక ప్రగతి దిశగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పటేల్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ రాఘవేందర్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు సత్యపాల్ రెడ్డి, బాల నరసింహ, శ్రీనివాస్, బాల్ రాజు, మహేందర్, సదా గౌడ్, రవి గౌడ్, సోను, భరత్, నరేష్ తదితరులతో పాటు పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు.

# ఎస్ ఆర్ డి జి స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ వేడుకలు



**భూపాలపల్లి, జిల్లా ప్రతినిధి ఆగస్టు 20( పీపుల్స్ న్యూస్)**
భూపాలపల్లిలోని ఎస్ ఆర్ డి జి స్కూల్లో ఇన్వెస్టిట్యూర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నాయకత్వ బాధ్యతల ప్రాధాన్యతను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక మంచి నాయకుడికి క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన, నిజాయితీ, ఆత్మవిశ్వాసం, ఇతరులను గౌరవించే గుణం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వంటి లక్షణాలు ఎంతో అవసరమని తెలిపారు. నాయకత్వం అంటే కేవలం అధికారం కాదని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవడమే నిజమైన నాయకత్వమని విద్యార్థులకు సూచించారు.అనంతరం నూతనంగా ఎంపికైన విద్యార్థి నాయకులకు అధికారికంగా సాష్‌లు (ఝుంఫ్త్రవం) ధరింపజేసి, వారి బాధ్యతలను అప్పగించారు. విద్యార్థి నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిబద్ధతతో నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించేలా ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని నూతన విద్యార్థి నాయకులకు అభినందనలు తెలిపారు.

# ప్రకాశ్‌నగర్ డివిజన్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



**బాలానగర్ ఆగస్టు 21 ( పీపుల్స్ న్యూస్)**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రకాశ్‌నగర్ డివిజన్‌లో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్యామ్‌లాల్ బిల్డింగ్ సమీపంలోని ఎరుకల బస్తీ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దర్గా కరుణాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర చైర్మన్ కమ్మ కార్పొరేషన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేం దుకు ఆయన ముందుచూపుతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆధునిక భారతదేశ నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్న బండి రమేష్.. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హోసీ తోచర్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, రామాదేవి, ఎరుకల సురేష్, కొండ కిరణ్, పద్మారెడ్డి, పర్వేజ్, అలీ, గణేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో 47 అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం.

**- డా. జి. స్వర్ణ కుమారి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్.**



పత్రికా ప్రచురణార్థం

తెలంగాణ ప్రభుత్వం

ప్రిన్సిపాల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, ములుగు , ములుగు జిల్లా, తెలంగాణ .

Rc.No. E1/133/GMC/MLG/2026/01-2026 తేదీ: 20-8-2026

కాంట్రాక్ట్ రిక్రూట్మెంట్ కొరకు నోటిఫికేషన్ విడుదల

ప్రొఫెసర్-5, అసోసియేట్ ప్రొఫెసర్-17 , అసిస్టెంట్ ప్రొఫెసర్-25 పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన 31.03.2027 వరకు లేదా అవసరం తగినంత వరకు, ఏది ముందు అయితే అది వరకు పూర్తిగా ఒప్పంద ప్రాతిపదికన నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

ములుగు లోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ & దాని అనుబంధ ఆసుపత్రిలో వివిధ డిపార్ట్మెంట్ నందు పనిచేయడానికి G.O.R.T.No: 1276, ఫైనాన్స్ HRM (VII) తేది: 16.07.2026 ప్రకారం. తేది 24.08.2026 ఉదయం 11 గంటల నుండి 01.09.2026 మధ్యాహ్నం 2.00 గంటల వరకు వరకు దరఖాస్తులు స్వీకరించబడతాయి మరియు వాక్ ఇన్ ఇంటర్వ్యూ తే : 10.09.2026 న నిర్వహించబడును.

మరిన్ని సమాచారం మరియు దరఖాస్తు కొరకు, అధికారిక వెబ్సైట్ https://gmcmulugu.org ను సందర్శించండి.

Dr G.Swarna Kumari
Principal
Government Medical College
Mulugu

**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 ( పీపుల్స్ న్యూస్)**
ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల, అనుబంధ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. స్వర్ణ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రొఫెసర్--5, అసోసియేట్ ప్రొఫెసర్--17, అసిస్టెంట్ ప్రొఫెసర్--25 చొప్పున మొత్తం 47 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను 2027 మార్చి 31 వరకు లేదా అవసరం మేరకు ఒప్పంద ప్రాతిపదికన నియమించనున్నట్లు పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 24వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు సెప్టెంబర్ 10వ తేదీన వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోస్టుల వారీగా అర్హతలు, ఇతర నిబంధనలు, దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం. https://gmcmulugu.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రిన్సిపాల్‌డా.జి. స్వర్ణ కుమారి సూచించారు.

## ఆగస్టు 24 నుంచి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి.

**ప్రజలు తమ అర్జీలను నూతన ఐడీఓసీ కార్యాలయంలో అందజేయాలి.**
**జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు.**



**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (పీపుల్స్ న్యూస్)**
ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఆగస్టు 24వ తేదీ నుంచి నూతనంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ), ములుగులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆగస్టు 24వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎడమ వైపున ఉన్న సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల సేవలను ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ములుగు గట్టమ్మ సమీపంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన అత్యాధునిక సౌకర్యాలతో నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. వివిధ జిల్లా స్థాయి శాఖల కార్యాలయాలను ఒకేచోట ఏర్పాటు చేయడంతో ప్రజలు తమ పనుల కోసం వేర్వేరు ప్రాంతాల్లోని కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సులభంగా ప్రభుత్వ సేవలు పొందే అవకాశం కలిగిందన్నారు.విశాలమైన కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, ప్రజలకు అనుకూలమైన వసతులతో నూతన కలెక్టరేట్‌ను జిల్లా పరిపాలనకు కేంద్రబిందువుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ఈ నెల 16వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు పేర్కొన్నారు.
ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను సమర్పించేందుకు ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే సమయంలో ఈ మార్పును గమనించాలని సూచించారు. ఆగస్టు 24వ తేదీ సోమవారం నుంచి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు తమ దరఖాస్తులను అందజేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## కేంద్రీయ విద్యాలయం ములుగులో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు

**- సీతారాం, ప్రిన్సిపల్, కేంద్రీయ విద్యాలయం ములుగు**



केन्द्रीय विद्यालय, मुलुगु
तेलंगाना मॉडल स्कूल कैंपस, जवाहर नगर गांव, वेंकटपुर मंडल
जिला: मुलुगु, तेलंगाना (पिन 506344)
(शिक्षा मंत्रालय, भारत सरकार केअधीन एक स्वायत्त निकाय)
KENDRIYA VIDYALAYA, MULUGU
TELANAGANA MODEL SCHOOL CAMPUS, JAWAHAR NAGAR VILLAGE,
VENKATAPUR MANDAL, Dist: MULUGU, TELANGANA – 506344
(An Autonomous Body under the Ministry of Education, Govt of India)
email: kendriyavidyalayamulugu@gmail.com KVS Region Code: 11 KV Code:2559

फ़. सं. 1-4 /के. वि. मुलुगु /2026-27/ दिनांक:20.08.2026

ప్రెస్ నోట్

కేంద్రియ విద్యాలయ ములుగు 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు

కేంద్రియ విద్యాలయ ములుగు, జిల్లా ములుగు, తెలంగాణలో 2026–27 విద్యా సంవత్సరానికి బాలవాటిక-1, బాలవాటిక-2, బాలవాటిక-3 మరియు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు కొత్త ప్రవేశాల ప్రక్రియ నిర్వహించబడుతోంది.
కొత్తగా ప్రారంభమైన ఈ కేంద్రియ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి మరియు అర్హత కలిగిన తల్లిదండ్రులు నిర్ణీత తేదీలలో నమోదు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రవేశాల ముఖ్యమైన తేదీలు

| ప్రవేశ కార్యక్రమం | తేదీ |
| --- | --- |
| ప్రవేశాల కోసం నమోదు | 21.08.2026 నుండి 05.09.2026 వరకు |
| లాటరీ / డ్రా | 10.09.2026 |
| ప్రవేశ జాబితాల ప్రదర్శన | 12.09.2026 |
| ప్రవేశ కేటాయింపు మరియు ప్రవేశ ప్రక్రియ | 15.09.2026 నుండి 21.09.2026 వరకు |
| తరగతుల ప్రారంభం | 23.09.2026 |

ప్రవేశ ప్రక్రియ కేంద్రియ విద్యాలయ సంగతన్ (KVS) ప్రవేశ మార్గదర్శకాలు మరియు నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుంది. అర్హత, వయస్సు, ప్రాధాన్యతా క్రమం, రిజర్వేషన్ మరియు ఇతర ప్రవేశ నిబంధనలు వర్తిస్తాయి.

అర్హులైన తల్లిదండ్రులు నిర్ణీత గడువులోగా తమ పిల్లల ప్రవేశానికి నమోదు చేసుకోవాలని పాఠశాల యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. ప్రవేశానికి సంబంధించిన తదుపరి సమాచారం మరియు జాబితాలు పాఠశాల ద్వారా అధికారికంగా తెలియజేయబడతాయి.

పాఠశాల చిరునామా
కేంద్రియ విద్యాలయ ములుగు
తెలంగాణ మోడల్ స్కూల్ క్యాంపస్,
జవహర్ నగర్ గ్రామం, వెంకటాపూర్ మండలం,
జిల్లా: ములుగు, తెలంగాణ – 506344

ప్రిన్సిపాల్
కేంద్రియ విద్యాలయ ములుగు
आचार्य /PRINCIPAL
केन्द्रीय विद्यालय KENDRIYA VIDYALAYA
मुलुगु /MULUGU
तेलंगाना / TELANGANA-506344

**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయం ములుగులో 2026-27 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్రీయ విద్యాలయం ములుగు ప్రిన్సిపల్ సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.బాలవాటిక--1 నర్సరీ స్థాయి, బాలవాటిక--2 ఎల్‌కేజీ స్థాయి, బాలవాటిక--3 యూకేజీ స్థాయి,1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నూతన ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.ప్రవేశాల కోసం ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, సెప్టెంబర్ 10న లాటరీ, సెప్టెంబర్ 12న ప్రవేశ జాబితా ప్రచురణ, సెప్టెంబర్ 15 నుంచి 21 వరకు ప్రవేశాలు, ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి, సెప్టెంబర్ 23 నుంచి తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రవేశ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ప్రవేశాలు నిర్వహించబడతాయని తెలిపారు. విద్యార్థుల వయస్సు, రిజర్వేషన్ తదితర ప్రవేశ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు నిర్ణీత గడువులోగా తమ పిల్లల ప్రవేశానికి దరఖాస్తు చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీతారాం కోరారు.

# ప్రశ్నిస్తే దాడి చేస్తారా..?

- 1,అధికార పార్టీ నేతల తీరుపై విమర్శలు
- 2,విలేకరిపై అర్ధరాత్రి దాడి హేయనీయం
- 3,భూమి వివాదంపై వార్త ప్రసారం చేయడమే కారణమా ?
- దాడి జరిగి 4 రోజులవుతున్నా చర్యలు లేవు
- 4,పోలీసుల తీరుపై అనుమానాలు..
- ఆరుగురు దాడికి పాల్పడితే ముగ్గురిపైనే కేసా ?
- 5,జర్నలిస్టు సంఘాల ఖండన.. బాధ్యులపై కఠిన చర్యలకు డిమాండ్











**భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (పీపుల్స్ న్యూస్)**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన జర్నలిస్టులపై దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోంది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో భూ వివాదానికి సంబంధించిన వార్తను ప్రసారం చేసినందుకే ఆర్ బీ న్యూస్ విలేకరి రవితేజపై అధికార పార్టీ నాయకులు దాడి చేసి, ఆయన ఇంట్లోని ఫర్నీచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేసినట్లు బాధితులు వాపోతున్నారు. ఈ ఘ టనలో విలేకరి భార్యపైనా చేయిచేసుకోవడంతో వారిద్దరు ఆస్ప త్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దాడిని ఖండిస్తూ ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేస్తున్నా రు. నిందితులపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



### అధికార గర్వం..

ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు భూ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. గ్రామాలు, మండలాల్లో కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని పోలీసు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ తదితర శాఖల అధికారులను ప్రభావితం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అలాంటి వ్యవహారాల్లో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, వారి తరఫున ప్రశ్నించే జర్నలిస్టులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు చోటుచేసుకోవడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఒకవైపు ప్రజాపాలన, పారదర్శక పాలన అంటూ ప్రభుత్వాలు చెబుతుండగా, మరోవైపు అధికార పార్టీకి చెందిన కొందరు నేతలపై ఇలాంటి ఆరోపణలు రావడం ప్రభుత్వ ప్రతిష్ఠకు నష్టం కలిగించడంతో పాటు అధికార పార్టీకి తలనొప్పిగా మారే అంశమని చర్చ జరుగుతోంది.

### ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం..

జర్నలిస్టులు ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అధికార వ్యవస్థలో జరిగే అవకతవకలను ప్రశ్నించడం వారి బాధ్యత. ఒక వార్తపై అభ్యంతరం ఉంటే చట్టపరమైన మార్గాలను ఆశ్రయించాలి తప్ప.. జర్నలిస్టుపై దాడి చేయడం, అతని కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.భూ వివాదంపై వార్త ను ప్రసారం చేసినందుకే దాడి జరిగిందన్న ఆరోపణలు నిజమని తేలితే ఇది కేవలం ఒక జర్నలిస్టుపై జరిగిన దాడిగా కాకుండా, ప్రశ్నించే గొంతును అణచివేసే ప్రయత్నంగా చూడాల్సి ఉంటుంది. ఇలాంటి ఘటనలకు రాజకీయ రంగు పులుమకుండా పోలీసులు స్వతంత్రంగా దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

### ఆరుగురిపై ఆరోపణలు.. ముగ్గురిపైనే కేసా?

ఆరుగురు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు బాధితుల తరఫున ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు ముగ్గురిపైనే కేసు నమోదు చేసి, మిగిలిన ముగ్గురిని కేసు నుంచి తప్పించేందుకు పోలీసులు సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఈ ఆరోపణలపై పోలీసు శాఖ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. నిజంగా ఆరుగురు దాడిలో పాల్గొన్నారా? సీసీ కెమెరాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాల ఆధారంగా దర్యాప్తు జరిగిందా? అనే అంశాలపై పోలీసులు పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంది.

### జర్నలిస్టు సంఘాల ఆగ్రహం

విలేకరిపై జరిగిన దాడిని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. బాధిత జర్నలిస్టుకు రక్షణ కల్పించడంతో పాటు, దాడికి పాల్పడిన వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. జర్నలిస్టులపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

### ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం..

ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ఏ రాజకీయ పార్టీ అయినా ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు, తన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల వ్యవహారశైలిపై కూడా నియంత్రణ కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. స్థానిక స్థాయిలో కొందరు నాయకులపై వస్తున్న భూకబ్జా, అధికార దుర్వినియోగం, పోలీసు--రెవెన్యూ వ్యవస్థలపై ఒత్తిడి వంటి ఆరోపణలు ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. గత ప్రభుత్వంపై ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత నేపథ్యంలోనే అధికార మార్పు జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే స్థానిక స్థాయి నాయకుల వ్యవహారశైలిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల హామీల అమలు విషయంలో ప్రజల్లో అసంతృప్తి ఉందన్న విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో, పార్టీ నేతలపై వస్తున్న ఇలాంటి ఆరోపణలు ఆ అసంతృప్తిని మరింత పెంచే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### చట్టం ముందు అంతా సమానులే..

విలేకరిపై జరిగిన దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవడంతో పాటు, దాడికి పాల్పడిన వారెవరైనా చట్టం ముందు సమానమే అన్న సందేశాన్ని పోలీసులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అధికార పార్టీ నాయకత్వం కూడా ఇలాంటి ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో సోషల్ మీడియా వేదికగా ఈ దాడిని ఘటనలు అంతటా చక్కర్లు కొట్టి రాజకీయ రంగు పులుముకొని అధికార పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందిగా పరిణమించే ప్రమాదం ఉంది.
ఆరోపణలపై నిజానిజాలను వెలికితీసి, చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటే ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడి ప్రజలకు మంచి సందేశం వెళ్లే అవకాశం ఉంది.

# స్వర్గీయ శ్రీ కుసుమ జగదీష్ 50వ జయంతి వేడుకలు

● జేడీ మల్లంపల్లి మండల కేంద్రంలో కీర్తిశేషులు కుసుమ జగదీశ్ తల్లిదండ్రుల సమక్షంలో మాచర్ల ప్రభాకర్,బాత్తోజు ద్రోణాచారి ఆధ్వర్యంలో ఘనంగా జయంతి








ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (పీపుల్స్ న్యూస్)

వేడుకలు ముఖ్య అతిథిగా విచ్చేసిన బి ఆర్ ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న తెలంగాణ ఉద్యమ కెరటం, ములుగు జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్మన్, ప్రజా హృదయ విజేత స్వర్గీయ శ్రీ కుసుమ జగదీష్ 50వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. భూక్య జంపన్న మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ములుగు గడ్డపై సింహగర్జనగా నిలిచి, స్వరాష్ట్ర సాధన కోసం లాఠీ దెబ్బలకు, జైలు జీవితానికి వెరవకుండా జై తెలంగాణ నినాదంతో ఉద్యమ స్ఫూర్తిని చాటిన మహోన్నత నాయకుడు జగదీష్ మీరు భౌతికంగా దూరమైనా మీ చిరునవ్వు, జ్ఞాపకాలు, ఆత్మీయత ప్రజల హృదయాల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి. మీరు లేని లోటు ములుగు జిల్లా ప్రజలకు తీరనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ సర్పంచ్ అకుల మల్లేష్ , దేవానగర్ మాజీ సర్పంచ్ రాజేశ్వరావు వార్డు మెంబర్ పాషా , రాజ్ కుమార్ , భూక్యా దేవేందర్ చంద్రమోగిలి ,పెద్ది రాకేష్ రెడ్డి రంజాన్ రాజమౌళి లింబాద్రి , రేణుకుంట్ల సురేష్ , మొర్రి రాజు , మహమ్మద్ చోటు , రమేష్ ,నూనెటి రాజు ,గొర్రె మహేందర్ , సతీష్ కళ్యాణ్ ములుగు రాజన్న ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన ఎంసిహెచ్ ఆర్ డి శిక్షణ అధికారులు











(రామప్ప )ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (పీపుల్స్ న్యూస్)

మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని గురువారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ఆఫీసర్స్ భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్ కుసుమ సూర్య కిరణ్, టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఎంసిహెచ్ఆర్డి అధికారులు వెంకటేశ్వర్లు, రవి, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీసులు, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టు రవితేజపై దాడిని ఖండించిన కీర్తి రెడ్డి, సత్యపాల్ రెడ్డి

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి





జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (పీపుల్స్ న్యూస్)

చిట్యాల మండలానికి చెందిన జర్నలిస్టు రవితేజపై జరిగిన దాడిని బీజేపీ రాష్ట్ర నాయకులు డా. చందుపట్ల కీర్తి రెడ్డి, చందుపట్ల సత్యపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవితేజను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. వార్తా కథనాలపై అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాలను ఆశ్రయించాలి కానీ, జర్నలిస్టులను భయపెట్టడం, బెదిరించడం, దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. రవితేజపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. బాధిత జర్నలిస్టుకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆయనకు పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. జర్నలిస్టుల స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నాలను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, అర్బన్ అధ్యక్షులు గీస సంపత్, నాయకులు తిరుపతి, రవికుమార్, హరీష్, కొమురయ్య, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం

- ఆర్ఎంపీ డాక్టర్ రవీందర్ ను పరామర్శించి 7 వేల ఆర్థిక సాయం అందించిన లక్ష్మీదేవిపేట సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్





లక్ష్మీదేవిపేట ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 20 (పీపుల్స్ న్యూస్)

రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి వ డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచన మేరకు వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ఎంపి డాక్టర్ రవీందర్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని పరామర్శించి స్థానిక సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ 5 వేల రూపాయలు ఉప సర్పంచ్ కొండా తిరుపతి 2 వేల రూపాయలు రవీందర్ కు అందించి వారికి అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి వర్యులు సీతక్క దృష్టికి తీసుకుపోయిమీ కుటుంబానికి అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కంటికి రెప్పలా కాపాడుకుంటామని వారు అన్నారు .ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టెకొల్ల వెంకటేష్ స్థానిక వార్డు సభ్యులు మద్దెల సువర్ణ రమేష్. సీనియర్ నాయకులు గజవేణి రమేష్. గోస్కుల తిరుపతి యూత్ కాంగ్రెస్ నాయకులు కన్నం మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్టీపీసీలో రోడ్డు ప్రమాదం.. ఒకరి దుర్మరణం

- ఇద్దరికి తీవ్ర గాయాలు



రామగుండం ఎన్టీపీసీ,ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)

ఎన్టీపీసీ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల ప్రకారం.. రామగుండం వైపు ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వెళ్తుండగా రాజీవ్ రహదారిపై బైక్ అదుపుతప్పి సెంటర్ డివైడర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బికాస్ జాల్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ప్రయాణిస్తున్న అర్జున్, కరణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు, క్షతగాత్రులు ఒరిస్సా రాష్ట్రం కు చెందిన వీరు రామగుండం పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనిలో నివాసం ఉంటు, కూలీ పనులు చేసుకుంటూ ఉంటారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చెపట్టారు.

# బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేసిన సీపీ సుమతి

CEIRతో 1,834 ఫోన్ల రికవరీ.. యజమానులకు పోలీసుల చేతుల మీదుగా అందజేత

మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)



పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను CEIR పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేసిన మల్కాజిగిరి పోలీసులు వాటిని సంబంధిత బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ స్వయంగా బాధితులకు రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను అందజేశారు. గత ఏడు నెలల్లో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని 29 పోలీస్ స్టేషన్ల పరిధిలో 1,834 పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను CEIR సాంకేతికత ద్వారా పోలీసులు గుర్తించి రికవరీ చేశారు.

**“పోయిన ఫోన్ తిరిగి వస్తుందనే నమ్మకం కల్పిస్తున్నాం”**

ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్ పోయినా లేదా దొంగిలించబడినా ప్రజలు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి CEIR పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లను గుర్తించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటివరకు రికవరీ కాని ఫోన్లను కూడా గుర్తించేందుకు పోలీసులు నిరంతరం ప్రయత్నిస్తున్నారని, కొన్ని ఫోన్ల రికవరీకి కొంత సమయం పట్టవచ్చని చెప్పారు. రికవరీ అయిన ప్రతి మొబైల్‌ను సంబంధిత యజమానికి ధృవీకరణ అనంతరం అప్పగిస్తామని తెలిపారు.

**బాధితుల ముఖాల్లో ఆనందం**

చాలా రోజుల క్రితం పోగొట్టుకున్న తమ మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. పోలీసుల సాంకేతిక నైపుణ్యం, CEIR పోర్టల్ ద్వారా ఫోన్లను గుర్తించి తిరిగి అందజేయడంపై సీపీ సుమతికి కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి CEIRలో నమోదు చేసుకోవాలని మల్కాజిగిరి పోలీసులు మరోసారి సూచించారు.

# మెదక్ రోడ్డు బ్రిడ్జి పనుల కారణంగా నేడు విద్యుత్ నిలిపివేత



**చేగుంట ఆగస్టు 20**

చేగుంట మండలం మెదక్ రోడ్ వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం రేపు విద్యుత్ సరఫరానునిలిపివేయనున్నట్లు చేగుంట విద్యుత్ శాఖ ఏ ఈ వెంకటప్ప రెడ్డి తెలిపారు.బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్లను నరికివేయాల్సి ఉండటంతో శుక్రవారం 21.08.2026 న ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు మెదక్ రోడ్ఏరియా ట్రాన్స్ఫార్మర్ నుండి విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.ఈ కోత కారణంగా ఆ ఏరియాలోని ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలకు ఇబ్బంది కలగనుంది. కావున ప్రజలు, వ్యాపారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

# డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక ఆదాయం పొందేలా రైతులను ప్రోత్సహించాలి

**- ఆర్గానిక్ సాగు చేస్తున్న రైతును అభినందించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్,ఆగస్టు,20,**

హవేలీ ఘనపూర్ మండలం బొగడ భూపతిపూర్ గ్రామంలో రైతు దొమ్మట జైపాల్‌రెడ్డి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం పరిశీలించారు. ఒక ఎకరంలో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, సాగు ఖర్చులు, దిగుబడి, మార్కెట్ ధరలు, ప్రభుత్వం అందించిన సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే డ్రాగన్ ఫ్రూట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేసేలా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఆదాయం పెంచుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఆర్గానిక్ పద్ధతిలో ఆధునిక సాగు విధానాలను అనుసరిస్తున్న రైతు జైపాల్‌రెడ్డిని కలెక్టర్ అభినందించారు. సాగులో డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ పద్ధతులు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తేనెటీగల పెంపకంతో స్వయం ఉపాధి

**- రైతులకు అదనపు ఆదాయం.. సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్,ఆగస్టు,20**

తేనెటీగల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయంతో పాటు స్వయం ఉపాధి పొందవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం హవేలీ ఘన్‌పూర్ మండలం బోగడ భూపతిపూర్ గ్రామంలో రైతు జైపాల్‌రెడ్డి పొలంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తేనెటీగల పెంపకాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 మంది రైతులకు 104 తేనెటీగల పెంపకం బాక్సులను 40 శాతం సబ్సిడీ, 60 శాతం లబ్ధిదారుల వాటాతో అందించినట్లు తెలిపారు. ఒక్క బాక్సుకు రూ.6 వేల ఖర్చు కాగా, ఉద్యానవన శాఖ రూ.2,400 సబ్సిడీగా, లబ్ధిదారు రూ.3,600 భరించాల్సి ఉంటుందని వివరించారు.ఒక్క బాక్సు ద్వారా 15 రోజులకోసారి సుమారు 3 కిలోల తేనె ఉత్పత్తి అవుతుందని, కిలోకు రూ.600 చొప్పున రూ.1,800 వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. 104 బాక్సుల ద్వారా నెలకు సుమారు 312 కిలోల తేనె ఉత్పత్తి చేసి రూ.1.87 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.తేనెటీగల పెంపకంపై నిపుణుల ద్వారా పూర్తి అవగాహన, శిక్షణ పొందాలని రైతులకు సూచించారు.వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని కోరారు. ఉద్యానవన శాఖ అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం

**హైదరాబాద్, ఆగస్టు 20:** నగరంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్లపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకునేందుకు కొందరు వాహనదారులు ఉద్దేశపూర్వకంగా రక రకాల జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు. నంబర్ ప్లేట్లను మార్చడం, స్పష్టంగా కనిపించకుండా చేయడం, నిబంధనలకు విరుద్ధమైన ప్లేట్లను ఏర్పాటు చేసుకోవడం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన పోలీసులు.. వారం రోజుల్లోనే నకిలీ నంబర్ ప్లేట్లకు సంబంధించి ఆరు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా కనిపించేలా, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

# విద్యార్థులకు షీ టీమ్ అవగాహన





**రామగుండం ఎన్టీపీసీ,ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)**

మహిళలు, బాలికల భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి షీ టీమ్ సభ్యులు సూచించారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో ఎన్టీపీసీ సుభాష్‌నగర్‌లోని ఎం.పి.పి.ఎస్. పాఠశాలలో విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీమ్ సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పోక్సో చట్టం, సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థుల ప్రవర్తన, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు.మహిళల రక్షణ కోసం బస్టాండ్‌లు, ప్రధాన చౌరస్తాలు, జనసమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీమ్ నిఘా కొనసాగుతుందని తెలిపారు. వేధింపులకు గురైన మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రమాదం లేదా బెదిరింపులు ఎదురైతే 100/112, ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రయాణ సమ యంలో మహిళలు ౧-౼ఘటవ ౼జూజూను వినియోగించాలని తెలిపారు.కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ శారద, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# దాసరి స్వప్న మహేష్‌కు అటల్ ఇండియా ఐకాన్ అవార్డు






**రామగుండం ఎన్టీపీసీ,ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)**

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఢిల్లీకి చెందిన ఫేమస్ పీపుల్ ఇండియా వరల్డ్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులను గుర్తించి జాతీయ స్థాయి అటల్ ఇండియా ఐకాన్ అవార్డు--2026లను అందజేసింది.

ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ, పెద్దపల్లి జిల్లా రామగుండానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు, ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి స్వప్న మహేష్కు కూడా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేశారు.అయితే అనివార్య కారణాల వల్ల దాసరి స్వప్న మహేష్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. దీంతో నిర్వాహకులు జాతీయ స్థాయి అటల్ ఇండియా ఐకాన్ అవార్డు--2026 ప్రశంసా పత్రాన్ని మెయిల్ ద్వారా ఆయనకు పంపించారు.ఈ పురస్కారం తన సేవలను గుర్తించి అందించడం పట్ల దాసరి స్వప్న మహేష్ హర్షం వ్యక్తం చేశారు. అవార్డు రావడం పట్ల ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు, ట్రస్ట్ పోషకులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# ట్రాఫిక్ పోలీసులకే రక్షణ కరువా?

**● జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ సిబ్బందిపై యువకుడి దాడికి యత్నం.**

**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)**

జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్వేన్ కాలనీ చౌరస్తా వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిపై ఓ గుర్తుతెలియని యువకుడు దాడికి ప్రయత్నించిన ఘటన కలకలం రేపింది.ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటంతో పాటు రహదారులపై క్రమశిక్షణ, భద్రత కోసం ట్రాఫిక్ పోలీసులు ఎండా, వానా లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబాలను సైతం పక్కన పెట్టి గంటల తరబడి రోడ్లపై విధులు నిర్వర్తిస్తున్న పోలీసులపై దాడులకు యత్నించడం ఆందోళన కలిగించే పరిణామంగా స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజల భద్రత కోసం రోడ్లపై నిలబడే పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి ప్రయత్నించిన వ్యక్తిని గుర్తించి, ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమా ండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునం ావృ తం కాకుండా ట్రాఫిక్ సిబ్బందికి తగిన భద్రత కల్పించాలని కోరుతున్నారు.

**టాపిక్: ట్రాఫిక్ పోలీసులకు రక్షణ ఎక్కడ?**



విధుల్లో ఉన్న పోలీసులపై దాడి లేదా దాడికి యత్నం ఏ రూపం ఉన్న ఉపేక్షించకూడదనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

# బాలికా విద్యకు ప్రోత్సాహం.. 171 సైకిళ్ల పంపిణీ







**రామగుండం ఎన్టీపీసీ,ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)**

బాలికల విద్యను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలలకు సులభంగా, సురక్షితంగా చేరుకునేలా చేయాలనే ఉద్దేశంతో ఎన్టీపీసీ సీఎస్ఆర్ కార్యక్రమం కింద 171 సైకిళ్లను పంపిణీ చేశారు. రామగుండం మండలంలోని ఎనిమిది పాఠశాలలకు చెందిన 9వ తరగతి బాలికలకు గురువారం అశోక్‌నగర్‌లోని జెడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాలలో ఈ సైకిళ్లను అందజేశారు. కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలికలు పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేందుకు, రవాణా సమస్యలను అధిగమించేందుకు సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యను కొనసాగించడంలో బాలికలకు అండగా నిలవడమే ఈ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# విద్య, వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట...

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- సత్తుపల్లి మునిసిపల్ పరిధిలో రూ.1.83 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన, రూ.1.43 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించిన మంత్రి



**సత్తుపల్లి /ఆగస్టు20/(పీపుల్స్ న్యూస్ )** ప్రజారోగ్యం, విద్యారంగాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ. 1.83 కోట్ల వ్యయంతో






చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, పట్టణ పేదలకు నాణ్యమైన ఉచిత ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎన్టీఆర్ నగర్‌లో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. హెల్త్ సెంటర్ కావాల్సిన వైద్యాధికారులు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతామన్నారు.అలాగే శివసాయి నగర్‌లో రూ. 40 లక్షల నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల సామాజిక కార్యకలాపాలకు, శుభకార్యాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పటిష్టమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యం.

**ఉప్పల్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన మల్కాజిగిరి సీపీ బి. సుమతి.**



**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)** మల్కాజిగిరి సీపీ బి. సుమతి, ఖూా ఉప్పల్ పోలీస్ స్టేషన్‌తో పాటు ఏసీపీ ఉప్పల్ కార్యాలయాన్ని సందర్శించి పోలీస్ శాఖ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి విధులు, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ తీరును తెలుసుకున్నారు.
ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సీపీ సుమతి అధికారులకు సూచించారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.ప్రజలే కేంద్రంగా పోలీసింగ్.. తక్షణ స్పందన, సమర్థవంతమైన సేవలే లక్ష్యం అని సీపీ స్పష్టం చేశారు.

# శ్రీ సిద్దేశ్వర స్వామి సిద్దుల గుట్ట ఆలయ హుండీ ఆదాయం... 5,11,472/- రూపాయలు...!

**- నల్లగొండ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ రావు...!!**



**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 20** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని స్వయంభు శ్రీ సిద్దేశ్వర స్వామి సిద్దుల గుట్ట ఆలయ హుండీ ఆదాయం రూ. 5,11,472/- సమకూరినట్లు దేవాదాయ శాఖ ఈఓ చిందం వంశీ తెలిపారు. 2026 మార్చి 24 నుండి 2026 అగస్టు 20వరకు భక్తులు హుండీలో సమర్పించిన నాలుగు నెల్ల ఇరవై ఐదు రోజుల కానుకల ఆదాయాన్ని ఆలయ మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నల్గొండ (ూజ) అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ రావు పర్యవేక్షణలో లెక్కించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, ఆలయ చైర్మన్ ఈదులకంటి వెంకట్ రెడ్డి, ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, మహబూబాబాద్ నుండి వచ్చిన...శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సేవ సమితి సభ్యులు...గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.

# ఆక్రమణలపై ఏసీపీ శంకర్ రాజు కొరడా!

- దానియాలగుట్ట--ఇందిరానగర్ రహదారి క్లియర్.. రెండు వైపులా సాఫీగా ట్రాఫిక్.









**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)** రహదారి ఆక్రమణలపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఏసీపీ జి. శంకర్ రాజు, ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఆధ్వర్యంలో దానియాలగుట్ట--ఇందిరానగర్ ప్రధాన రహదారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగించారు.పోలీస్ కమిషనర్ శ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీపీ ట్రాఫిక్-1 కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఏసీపీ శంకర్ రాజు క్షేత్రస్థాయిలో చర్యలను పర్యవేక్షించారు.బేగంపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో, అలాగే ప్రధాన రహదారి ఇరువైపులా ఏర్పడిన ఆక్రమణలను తొలగించడంతో రహదారి విస్తీర్ణం పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. గతంలో ఆక్రమణల కారణంగా ఒక వైపు మాత్రమే వాహనాల రాకపోకలు సాగుతుండగా, ప్రస్తుతం రెండు వైపులా వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది.

**ఆక్రమణల తొలగింపుతో వాహనదారులకు ఊరట**

రహదారి ఆక్రమణలను తొలగించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గడంతో పాటు స్థానిక ప్రజలు, వాహనదారులకు మరింత సౌకర్యం కలిగింది. రహదారులు ఆక్రమణలకు గురికాకుండా సంబంధిత శాఖల సమన్వయంతో నిరంతరం చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ జి. శంకర్ రాజు, ఏసీపీ టి.ఎల్. రమేష్ కుమార్, బేగంపేట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్, ఆర్ఎస్ఐ అశోక్ రెడ్డి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.ఆక్రమణల తొలగింపుతో రహదారి అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జనగామ మల్లారెడ్డి.



**దౌల్తాబాద్ ఆగష్టు 20(** మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనగామ మల్లారెడ్డి ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జనగామ మల్లారెడ్డి మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణానికి తన దూరదృష్టితో బాటలు వేసిన యువనేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ముఖ్యంగా దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన దార్శనిక నాయకుడిగా రాజీవ్ గాంధీ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. నిరుపేదలకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడిగా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పడాల రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి, సీనియర్ నాయకులు కర్నాల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు స్వామి, సర్పంచులు బండారు లాలు, బొక్కల నాగరాజు, దాసు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పడాల మల్లేశం, సంపత్ రెడ్డి, లలిత కృష్ణ, దుబ్బాక నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి బాల్ శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచులు ఆది వేణుగోపాల్, భద్రయ్య, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ, నాయకులు యేసు, బుచ్చిరెడ్డి, ఆది మల్లికార్జున్, లింగం, కుమ్మరి శ్రీనివాస్, గొల్ల రమేష్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు





**జవహర్ నగర్,ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్):** స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా గురువారం జవహర్ నగర్ లో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి టీపీసీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్ పాల్గొని పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు.
అనంతరం ఆయనను స్మరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షురాలు మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, కోటేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్ గుప్తా, ఓబీసీ విభాగం చైర్మన్ జవహర్ నగర్ పసుపులేటి వీరభాస్కరరావు, అనంతలక్ష్మి,సుబ్రమణ్యం,నర్సింగ్, ముఖేష్, చింతా విజయ, విజయ రాయ్, బొబిలి మంజుల సుంకరి శ్రీనివాస్, సాయి, మిగత కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మీ సమస్య -- మా పరిష్కారం కార్యక్రమంలో అలియాబాద్ మౌలిక వసతులపై వినతి



**అలియాబాద్, ఆగస్టు 20,**

అలియాబాద్ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "మీ సమస్య -- మా పరిష్కారం" కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని అలియాబాద్ మున్సిపాలిటీ ప్రజల మౌలిక వసతుల సమస్యలపై సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీ వెంకట్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీమతి శిరీష కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మాలతి రెడ్డిలను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా శక్తి మై వాయిస్ సంఘం ట్రెజరర్ శ్రీ అంబటి రమేష్, అలియాబాద్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీ మల్యాల మహేష్, లతతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రజలకు ఉచిత గ్రామీణ్ బీమా "మీ సమస్య -- మా పరిష్కారం" కార్యక్రమంతో పాటు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (గ్రామీణ్) పథకాన్ని మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా అందించేందుకు మహిళా శక్తి మై వాయిస్ సంఘం ముందుకు వస్తోందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం తమ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

## ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలే.

### - మున్సిపాలిటీ అధికారులు ఎక్కడ ?






**మూడు చింతలపల్లి, (ఆగస్టు 20) :-** మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగ్గం గుడా కొల్తూరు చౌరస్తాలోని చాయి బంక్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికారులు మాత్రం ఇటువైపుగా కన్నెత్తి చూసిందే లేదని స్థానికులు అధికారుల పనితీరుని చూసి నివ్వెరపోతునారు. అధికారుల కంటికి ఇలాంటి అక్రమ నిర్మాణాలు కనిపించవా. అని అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నారు స్థానికులు. ప్రతి ఒక్కరికి సమా న్యాయం చేసేలా చూడాల్సిన బాధ్యత అ ధికారులపై ఉంటుందని అధికారుల విధులను గుర్తుకు చేస్తున్నారు స్థానికులు. అధికారులే ప్ర భుత్వ ఖజానాకు గండి కొడితే ప్రభుత్వ పాలనను కాపాడేది ఎవరని అధికారులకు మరొక్కసారి గు ర్తుకు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి అక్రమ నిర్మాణాలను నిర్మించిన వారి పై కఠిన చర్యలు తీసుకొని వారిపై కేసు నమోదు చేయాలని మొరపెట్టుకుంటున్నారు స్థానికులు.

## చిన్నరామచర్లలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...!

### - సర్పంచ్ మహ్మద్ అజాం...!!



**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 20 :**

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోనిచిన్నరామన్ చర్ల గ్రామంలో గురువారం రోజున గ్రామస్తులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంని... గ్రామ సర్పంచ్ మహమ్మద్ అజాం, ఉప సర్పంచ్ కంత్రి యాదయ్య, జిపిఓ యాకయ్య, డీలర్ మంగళపల్లి శ్రీనివాస్ లు, కలిసి గ్రామస్తులకు అందజేశారు, అందుబాటులో వున్నా గ్రామ ప్రజలందరూ స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ పిన్నింట్ బాపురెడ్డి, మాజీ సర్పంచ్ గుడికందుల యాదగిరి కళ్లెం రమేష్, బెజగాం నరేష్, నిమ్మ కర్ణాకర్, బాబు గౌడ్,యావల్ల అంజనకుమార్, జన్నే భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆహార కల్తీపై మల్కాజిగిరి పోలీసుల ఉక్కుపాదం!

● రూ.1.50 కోట్ల విలువైన కల్తీ, గడువు ముగిసిన మసాలాలు స్వాధీనం.. రెండు ప్రాంతాల్లో భారీ దాడులు









**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఆహార కల్తీ దందాపై మల్కాజిగిరి పోలీసులు ఉక్కుపాదం మోపారు. సీపీ బి. సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో ఎంఫాస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఓటీ మల్కాజిగిరి, ఎస్ఓటీ కంటోన్మెంట్, ఉప్పల్, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించి భారీగా కల్తీ, గడువు ముగిసిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

**రామంతాపూర్‌లో గడువు ముగిసిన మసాలాల రీ-ప్రాసెసింగ్**

ఉప్పల్ రామంతాపూర్‌లోని వి. మెహక్ మసాలాస్‌పై నిర్వహించిన దాడుల్లో గడువు ముగిసిన మసాలాలను తిరిగి ప్రాసెస్ చేసి కొత్త ప్యాకెట్లలో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో 330 కిలోల గడువు ముగిసిన మసాలాలు, 400 కిలోల జీలకర్ర, 1,750 కిలోల పసుపు, 25 కిలోల ధనియాలు, 53 కిలోల ప్యాకింగ్ మెటీరియల్, ఐదు ప్రాసెసింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ. 1.25 కోట్లుగా పోలీసులు తెలిపారు. సంస్థ సూపర్‌వైజర్ దేవ్నాని భూపేష్‌ను పోలీసులు గుర్తించగా, యజమాని కవితా నరేష్ దేవ్నాని ఆపరేషన్ సమయంలో అందుబాటులో లేరని తెలిపారు.

**మేడిపల్లిలో మరో భారీ కల్తీ దందా బట్టబయలు**

మేడిపల్లి శ్రీనివాస్‌నగర్‌లోని సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై నిర్వహించిన దాడుల్లో అపరిశుభ్ర వాతావరణంలో పసుపు, కారం, ధనియా, గరం మసాలాల తయారీ జరుగుతున్నట్లు గుర్తించారు. కారం పొడిలో సుమారు 30 శాతం సాడస్ట్ కలుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే 'స్వదేశీ స్వస్తిక్' బ్రాండ్‌ను పోలిన నకిలీ/లుక్‌అలైక్ ప్యాకేజింగ్‌ను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. దాడుల్లో 2,300 కిలోల పసుపు పొడి, 3,350 కిలోల కారం పొడి, 5,140 కిలోల ధనియా పొడి, 100 కిలోల గరం మసాలా కలిపి మొత్తం 10,890 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 25 లక్షలుగా పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో సత్యనారాయణ, రుద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న సరుకుతో పాటు వారిని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు.

**కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవు**

ఆహార భద్రత, కల్తీ, మిస్‌బ్రాండింగ్ చట్టాల ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ఆహార కల్తీని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్యాకేజ్డ్ ఫుడ్ కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, వివ రాలను తప్పనిసరిగా పరిశీలించాలని పోలీసులు ప్రజలకు సూచి ంచారు. ఆహార కల్తీకి సంబంధించిన సమాచారం ఉంటే హెల్ప్ లైన్ 8712662111కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కల్తీ ఆహారంపై నిరంతర నిఘా కొనసాగిస్తామని మల్కాజిగిరి పోలీసులు తెలిపారు.

# మహిళల భద్రతకు భరోసా.. నేరస్తుల్లో మార్పే లక్ష్యం

● 'సంస్కార్' కౌన్సెలింగ్‌తో యువతకు చట్టాలపై అవగాహన.. మల్కాజిగిరి సీపీ బి. సుమతి ఐపీఎస్ హెచ్చరిక









**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)**

మహిళలు, బాలికల పట్ల వేధింపులు, స్టాకింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు, పబ్లిక్ న్యూసెన్స్ తదితర నేరాలకు పాల్పడిన వారిలో ప్రవర్తనా మార్పు తీసుకురావడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించేందుకు మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో 'సంస్కార్ మెగా కౌన్సెలింగ్ కార్యక్రమం' నిర్వహించారు. ఆగస్టు 20న కుషాయిగూడ, ఏఎస్ రావునగర్‌లోని అనుపురం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ద్వారా పట్టుబడిన నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా యువత, తొలిసారి నేరాలకు పాల్పడిన వారికి ప్రవర్తనా మార్పు, చట్టపరమైన అవగాహన, భావోద్వేగ నియంత్రణ, మహిళల పట్ల గౌరవం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సీపీ సుమతి హెచ్చరిక.. "యూనిఫాం లేకపోయినా పోలీసు వ్యవస్థ మొత్తం వెనుకే ఉంది" కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ మాట్లాడుతూ.. మహిళలను ఉద్దేశపూర్వకంగా లేదా అనుకోకుండా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా, వారి స్వేచ్ఛను దెబ్బతీసేలా వ్యవహరించినా షీ టీమ్స్ గుర్తించి 'సంస్కార్' కౌన్సెలింగ్‌కు తీసుకువస్తాయని స్పష్టం చేశారు.

కౌన్సెలింగ్ అనేది ఎవరినీ అవమానించేందుకు కాదని, చేసిన తప్పును గుర్తించి, దాని పర్యవసానాలను అర్థం చేసుకుని ప్రవర్తన మార్చుకునేందుకు ఇచ్చే అవకాశమని సీపీ తెలిపారు. "షీ టీమ్స్ ఎల్లప్పుడూ యూనిఫాంలో కనిపించకపోవచ్చు. కానీ వారి వెనుక పోలీసు అధికారులు, మొత్తం పోలీసు వ్యవస్థ ఉంటుంది. యూనిఫాం కనిపించడం లేదని పోలీసుల అధికారం లేదని భావించవద్దు" అని సుమతి హెచ్చరించారు.

**228 మంది పట్టుబాటు.. యువతపై ప్రత్యేక దృష్టి**

2026 జూన్ 1 నుంచి జూలై 31 వరకు మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లలో షీ టీమ్స్ 30 ఎఫ్ఐఆర్‌లు, 71 పెట్టీ కేసులు నమోదు చేసి 228 మందిని పట్టుకున్నాయివారిలో 20 మంది మైనర్లు కాగా, 50 ఏళ్లు పైబడిన వారు నలుగురు ఉన్నారు. ముఖ్యంగా 24 ఏళ్లలోపు యువకులు 152 మంది ఉండటం ఆందోళన కలిగించే అంశమని పోలీసులు తెలిపారు. ఆరుగురు పునరావృత నేరస్తులు కాగా, ఒక వ్యక్తి ఏకంగా ఆరు కేసుల్లో ఉన్నట్లు వెల్లడైంది. మైనర్లకు తమ తప్పులను తెలుసుకుని మారేందుకు అవకాశం కల్పిస్తున్నామని సీపీ తెలిపారు. అయితే ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేయకుండా చట్టాన్ని గౌరవించాలని సూచించారు.

**"ఫోన్ మార్చినా.. నేరం నుంచి తప్పించుకోలేరు"**

నేరం చేసిన తర్వాత ఫోన్ మార్చడం, ఒకటి కంటే ఎక్కువ ఫోన్లు ఉపయోగించడం ద్వారా పోలీసుల నుంచి తప్పించుకోవచ్చని భావించవద్దని సీపీ స్పష్టం చేశారు. నేరానికి సంబంధించిన వివ రాలు, ప్రొఫైలింగ్ షీ టీమ్స్ వద్ద ఉండవచ్చని, మళ్లీ నేరానికి పాల్పడితే గుర్తించి పట్టుకునే అవకాశం ఉంటుందని హెచ్చరి ంచారు. "మహిళను తీర్పు చెప్పే హక్కు ఎవరికీ లేదు. ఆమె స్వేచ్ఛను నియంత్రించే హక్కు కూడా ఎవరికీ లేదు. మహిళలకు గౌరవ ంగా జీవించే హక్కు, తమ జీవితంపై స్వయంగా నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంది" అని సీపీ స్పష్టం చేశారు. మళ్లీ నేరానికి పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**29,740 మందికి అవగాహన.. 1,500కు పైగా డీకాయ్ ఆపరేషన్లు**

మహిళల భద్రత, సైబర్ సేఫ్టీ, పోక్సో చట్టం, చట్టపరమైన నిబంధనలు, సామాజిక బాధ్యత, సోషల్ మీడియా సురక్షిత వినియోగంపై షీ టీమ్స్ నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా 29,740 మందికి పైగా పౌరులకు అవగాహన కల్పించినట్లు సీపీ తెలిపారు. అదేవిధంగా షీ టీమ్స్ 1,500కు పైగా డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించాయి. వీటికి అదనంగా ప్రతి సోమవారం నిర్వహించే 126 బస్ డీకాయ్ ఆపరేషన్లు, 120 మెట్రో డీకాయ్ ఆపరేషన్లు చేపట్టినట్లు వెల్లడించారు.

**షీ టీమ్స్ అవసరం లేని సమాజమే అంతిమ లక్ష్యం**

మహిళల ఆత్మగౌరవం, గౌరవం, భద్రతను కాపాడటమే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యమని సీపీ తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవిస్తూ చట్టాన్ని పాటించే పరిస్థితి ఏర్పడి, భవిష్యత్తులో షీ టీమ్స్ అవసరం లేని సమాజం రావడమే తమ అంతిమ లక్ష్యమని సుమతి ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపులో నిందితులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించి, నేరాలకు దూరంగా ఉండాలని, తమ ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డీసీపీ కె. సురేష్ కుమార్, ఐపీఎస్, మహిళా భద్రత డీసీపీ టి. ఉషారాణి, ఏసీపీ పి. వెంకటేశ్వర్లు, మనోజాగృతి సైకాలజిస్టులు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, నిందితులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పటిష్టమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యం

## ఉప్పల్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన మల్కాజిగిరి సీపీ బి. సుమతి

**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)** మల్కాజిగిరి సీపీ బి. సుమతి, IPS ఉప్పల్ పోలీస్ స్టేషన్‌తో పాటు ఏసీపీ ఉప్పల్ కార్యాలయాన్ని సందర్శించి పోలీస్ శాఖ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి విధులు, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ తీరును తెలుసుకున్నారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సీపీ సుమతి అధికారులకు సూచించారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజలే కేంద్రంగా పోలీసింగ్.. తక్షణ స్పందన, సమర్థవంతమైన సేవలే లక్ష్యం అని సీపీ స్పష్టం చేశారు.









# సర్వే నం. 329లో అక్రమ నిర్మాణాలు.. మట్టి డంపింగ్‌పై చర్యలెప్పుడు?

**●ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా పనులు..**

**అధికారుల మౌనంపై స్థానికుల అనుమానాలు**









**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)** మహాదేవపురం పరిధిలోని సర్వే నంబర్ 329లో ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న స్థలంలో అక్రమ నిర్మాణాలు, భారీగా మట్టి డంపింగ్ జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ స్థలం అని రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూమిలో నిర్మాణాలు, మట్టి పోసే పనులు కొనసాగుతుంటే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గాజులరామారం పరిధిలోని సర్వే నంబర్ 329లో ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదం గతంలోనూ వెలుగులోకి వచ్చింది. ఒక నివేదిక ప్రకారం సర్వే నంబర్ 329లో 31 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి.

### సేత్వార్‌లో ప్రభుత్వ భూమి అయితే.. నిర్మాణాలు ఎలా?

సేత్వార్, ఇతర రెవెన్యూ రికార్డుల్లో భూమి స్వభావం ప్రభుత్వ భూమిగా ఉంటే, అదే స్థలంలో వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడానికి అనుమతులు ఎవరు ఇచ్చారు? నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఉన్నాయో అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.ఇదే సమయంలో ప్రభుత్వ స్థలంలోకి మట్టిని తరలించి డంపింగ్ చేయడానికి ఎవరి అనుమతి ఉంది? మట్టి ఎక్కడి నుంచి వస్తోంది? ం సంబంధించిన అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

### వెంచర్ల పేరుతో ప్రజలకు ముప్పు?

ప్రభుత్వ భూమికి ఆనుకుని లేదా ప్రభుత్వ భూమినే కలుపుకొని వెంచర్లు ఏర్పాటు చేస్తున్నట్లయితే, భవిష్యత్తులో ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజలు నష్టపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూమి హక్కులు, సర్వే హద్దులు, లేఅవుట్ అనుమతులు పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే ప్రజలు కొనుగోళ్లకు వెళ్లాలని వారు కోరుతున్నారు.

### అధికారుల మౌనం వెనుక కారణమేంటి?

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు, మట్టి డంపింగ్ జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారులు తక్షణమే స్థల పరిశీలన చేసి హద్దులు నిర్ధారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? అక్రమార్కులకు అధికారుల అండ ఉందా? లేక రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితుల మధ్య ఏదైనా వ్యత్యాసం ఉందా? అన్నది ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

### కలెక్టర్ స్థాయిలో విచారణకు డిమాండ్



సర్వే నంబర్ 329పై రెవెన్యూ, సర్వే, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి, సేత్వార్, పహాణి/ఆర్ఓఆర్, ఎఫ్ఎంబీ, ప్రస్తుత భౌతిక హద్దులను సరిపోల్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి అని నిర్ధారణ అయితే అక్రమ నిర్మాణాలు, మట్టి డంపింగ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు స్పందించకపోతే.. రేపు నష్టపోయేది ఎవరు? ప్లాట్లు కొనుగోలు చేసే అమాయక ప్రజలేనా? అన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

# టీటీడీ భూమి సమస్య పరిష్కారానికి కృషి చేసిన మండలి చైర్మన్, ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు : సంజయ్ దాస్ గౌడ్.



**చిట్యాల ఆగస్టు 20**
చిట్యాల పట్టణంలోని టీటీడీకి సంబంధించిన 1.12 గుంటల భూమి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి ఉపయోగపడే ఈ భూమి విషయంలో కొంతకాలంగా నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కళ్యాణ మండపం భూమిపై బీఆర్ఎస్ పోరాటం ఫలించింది: శివ శంకర్ రెడ్డి



**చిట్యాల ఆగస్టు 20**
కళ్యాణ మండపం నిర్మాణం కోసం దాతల సహకారంతో కొనుగోలు చేసిన భూమి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటం ఫలించిందని బీఆర్ఎస్ చిట్యాల పట్టణ నాయకుడు బొబ్బల శివశంకర్‌రెడ్డి అన్నారు. గురువారం చిట్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆదేశాల మేరకు కళ్యాణ మండపం భూమి పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేసినట్లు తెలిపారు. పార్టీ పోరాటం కారణంగానే కళ్యాణ మండపం కోసం కొనుగోలు చేసిన భూమి తిరిగి పట్టణ ప్రజలకు దక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. తాజాగా నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కళ్యాణ మండపం నిర్మాణం కోసం ఎకరం 12 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు, ఆ భూమిని యథాతథంగా అప్పగించాలని స్పష్టం చేసినట్లు శివశంకర్‌రెడ్డి తెలిపారు. భువనగిరి రోడ్డును సరిహద్దుగా చేసుకుని ఎకరం 12 గుంటల భూమిని తహసీల్దార్, రెవెన్యూ సర్వేయర్, మున్సిపల్ కమిషనర్ సంయుక్తంగా సర్వే చేయాలని అఖిలపక్ష సమావేశంలో సూచించినట్లు చెప్పారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి భూమిని తమ ఆధీనంలోకి తీసుకోవాలని, భవిష్యత్తులో ఎలాంటి కబ్జాలకు, అన్యాక్రాంతానికి అవకాశం లేకుండా చుట్టూ పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఇంతటితో ఆగదని, చిట్యాల పట్టణంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని శివశంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, 10వ వార్డు కౌన్సిలర్ నిమ్మనగోటి శ్రీనివాస్, 2వ వార్డు కౌన్సిలర్ ఎస్కే షబానా అజీముద్దీన్, సింగిల్ విండో డైరెక్టర్ కన్నెబోయిన శ్రీశైలం, సాయిరెడ్డి ప్రతాపరెడ్డి, పాల కృష్ణ, ఆగు అశోక్ యాదవ్, నలవత్ కృష్ణ, బులుగురు సైదులు, జిట్టా శేఖర్, మద్ది మధు, ఎండీ మజ్జు తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# చిట్యాల టిటిడి కళ్యాణ మండపం భూమిపై ఆక్రమణలు సహించేది లేదు: గుత్తా సుఖేందర్ రెడ్డి:

**- స్వాధీనపరుచుకోవాలని అధికారులకు ఆదేశం**



**చిట్యాల ఆగస్టు 20**
చిట్యాల పట్టణ కేంద్రంలోని 649 సర్వేనెంబర్ లోని 1.12 గుంటల భూమిని టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణం కోసం 2002లో కొనుగోలు చేయడం జరిగిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వెల్లడించారు. గత కొద్దిరోజులుగా చిట్యాల పట్టణ కేంద్రంలోని భువనగిరి రోడ్డు లో 649 సర్వే నెంబర్ లో గల 1ఎకరం 12 గుంటల భూమి కబ్జాకు గురవుతుందని వస్తున్న ఆరోపణలపై గురువారం ఆయన ఫామ్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ శాసనమండలి సభ్యుడు చెరుపల్లి సీతారాములతో కలిసి ఆయన మాట్లాడారు. 2002లో చిట్యాల పట్టణ కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం టిటిడి కళ్యాణ మండపం నిర్మించాలనే ఉద్దేశంతో దాతల సహకారంతో పట్టణ కేంద్రంలోని భువనగిరి రోడ్డులో గల సర్వే నెంబర్ 649లో రోడ్డు ఫేస్ కలిగిన 1ఎకరం 12 గంటల భూమిని రెండు లక్షల 50 వేలకు ధర చేసుకొని 2,25,000 రూపాయలు చెల్లించి మిగిలిన సొమ్మును రిజిస్ట్రేషన్ అనంతరం చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. కాలక్రమేనా అట్టి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో సంబంధిత గ్రామపంచాయతీ, మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో అట్టి భూమి గత కొద్ది రోజుల క్రితం కొంతమంది వ్యక్తులచే రోడ్డు ఫేస్ కలిగిన 12 గంటల భూమి ఆక్రమణకు గురి కావడంతో చిట్యాల పట్టణవాసులు ఆగ్రహించి ఇట్టి విషయాన్ని మీడియా, సంబంధిత అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఈ భూ వివాదం చిలికి చిలికి గాలి వానలా మారి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టికి వెళ్ళింది. ఆనాడు భూమి కొనుగోలు విషయంలో ప్రధాన పాత్ర పోషించిన ఈయన ఈ వివాదంపై స్పందిస్తూ రోడ్డు ఫేస్ నుంచి వెనుక వరకు హద్దులతో 1ఎకరం 12 గంటల భూమి విక్రయించిన మాట వాస్తవమేనని కానీ ప్రస్తుతం కొందరు వ్యక్తులు రోడ్డు ఫేస్ 12 గుంటల భూమి కబ్జా చేయడం సరి కాదని అట్టి భూమిని కబ్జా చేసి నాటిన ఫెన్సింగ్ పలకలను వెంటనే తొలగించి సర్వే చేయించి ఎకరం 12 గంటల భూమిని తిరిగి ఫెన్సింగ్ చేయాలని రెవిన్యూ, మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇట్టి భూమిని పట్టణ అవసరాల కోసం మున్సిపల్ పాలకవర్గ తీర్మానం మేరకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీత, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పాల్గొన్నారు..

# భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంతంగా ముగిసిన బోనాల ఉత్సవాలు



● మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో పటిష్ట బందోబస్తు.. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల ప్రత్యేక చర్యలు

● భారీగా తరలివచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం

**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో ఆగస్టు 20 (పీపుల్స్ న్యూస్)**
మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు, పలహారం బండి ఊరేగింపులు భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంతంగా ముగిశాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.



ఈ మేరకు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ద్వారా ఒక ప్రకటనలో తెలిపారు.

**పటిష్ట బందోబస్తుతో భద్రత**
బోనాల ఉత్సవాలు, పలహారం బండి ఊరేగింపుల సందర్భంగా ప్రధాన ఆలయాలు, రద్దీ ప్రాంతాలు, ఊరేగింపు మార్గాల్లో ప్రత్యే క పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు.

**ట్రాఫిక్ నియంత్రణలో ట్రాఫిక్ పోలీసుల అప్రమత్తత**
పండుగ సందర్భంగా భారీగా భక్తులు, వాహనాలు తరలివచ్చిన నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. రద్దీ ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో వాహనాల రాకపోకలను క్రమబ ద్ధీకరించారు. ఊరేగింపు మార్గాల్లో అవసరమైన చోట్ల వాహనాల మళ్లింపు, పార్కింగ్ నియంత్రణ, ట్రాఫిక్ రద్దీ నివారణ చర్యలు చేపట్టారు. భక్తులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం విధులు నిర్వహించారు.

**నిరంతర పర్యవేక్షణతో పోలీసుల భద్రతా చర్యలు**
ఆలయాల పరిసరాలు, ప్రధాన కూడళ్లు, ఊరేగింపు మార్గాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ పరిస్థితిని పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

**ప్రజల సహకారంతో విజయవంతం**
భక్తులు, ఉత్సవ నిర్వాహకులు, స్థానిక ప్రజలు పోలీసులకు సహకరించడంతో బోనాల ఉత్సవాలు, పలహారం బండి ఊరేగింపులు శాంతియుతంగా, విజయవంతంగా ముగిశాయని సీపీ బి. సుమతి తెలిపారు. పండుగ సందర్భంగా విధులు నిర్వర్తించిన పోలీసు, ట్రాఫిక్ సిబ్బందిని సీపీ అభినందించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆమె స్పష్టం చేశారు.



# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం: బండి రమేష్

● సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారు

● బాలానగర్‌లో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**బాలానగర్ ఆగస్టు 21**
భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ముఖ్యంగా దేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారని పేర్కొన్నారు. నేడు భారతదేశం ప్రపంచ స్థాయిలో ఐటీ రంగంలో అగ్రగామిగా ఎదగడానికి ఆయన తీసుకున్న దూరదృష్టితో కూడిన నిర్ణయాలు ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. భారతదేశం నేడు ఐటీ ఎగుమతుల రంగంలో ఏటా సుమారు రూ. 19.2 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే స్థాయికి చేరుకోవడంలో రాజీవ్ గాంధీ ప్రారంభించిన సాంకేతిక ప్రగతి కీలక పునాదిగా నిలిచిందని బండి రమేష్ పేర్కొన్నారు. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ దేశాభివృద్ధి, యువత సంక్షేమం, సాంకేతిక ప్రగతి దిశగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పటేల్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ రాఘవేందర్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు సత్యపాల్ రెడ్డి, బాల నరసింహ, శ్రీనివాస్, బాల్ రాజు, మహేందర్, సదా గౌడ్, రవి గౌడ్, సోను, భరత్, నరేష్ తదితరులతో పాటు పలువురు మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు.

# ఎస్ ఆర్ డి జి స్కూల్లో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ వేడుకలు



**భూపాలపల్లి, జిల్లా ప్రతినిధి ఆగస్టు 20**
భూపాలపల్లిలోని ఎస్ ఆర్ డి జి స్కూల్లో ఇన్వెస్టిట్యూర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం కృష్ణ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నాయకత్వ బాధ్యతల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక మంచి నాయకుడికి క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన, నిజాయితీ, ఆత్మవిశ్వాసం, ఇతరులను గౌరవించే గుణం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వంటి లక్షణాలు ఎంతో అవసరమని తెలిపారు. నాయకత్వం అంటే కేవలం అధికారం కాదని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవడమే నిజమైన నాయకత్వమని విద్యార్థులకు సూచించారు. అనంతరం నూతనంగా ఎంపికైన విద్యార్థి నాయకులకు అధికారికంగా సాష్‌లు (ఝుంప్త్రవం) ధరింపజేసి, వారి బాధ్యతలను అప్పగించారు. విద్యార్థి నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిబద్ధతతో నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను పెంపొందించేలా ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని నూతన విద్యార్థి నాయకులకు అభినందనలు తెలిపారు.

# పీఎం రాహత్ కింద ప్రమాద బాధితులకు అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులు వైద్య సహాయం అందించాల్సిందే

- నగదు రహిత వైద్య సేవలను తిరస్కరించకూడదు
- పథకంపై ఆసుపత్రులు, ప్రజలకు పూర్తి అవగాహన అవసరం

-- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**విజయవాడ: ఆగస్టు 20, 2026.**
రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు పీఎం రాహత్ పథకం కింద నగదు రహిత అత్యవసర వైద్య సేవలు అందించడం నెట్‌వర్క్ ఆసుపత్రుల బాధ్యతని, చికిత్స అందించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించకూడదని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం జిల్లాలోని 51 నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులకు నిర్వహించిన పీఎం రాహత్ పథకం అవగాహన, శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితులకు వెంటనే నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2026 ఫిబ్రవరి 13న పీఎం రాహత్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద ప్రతి ప్రమాద బాధితుడికి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స, ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల వరకు అందే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి అత్యవసర వైద్య సేవలు అందించడమే పథకం ప్రధాన ఉద్దేశమని, డబ్బు లేకపోవడం వల్ల చికిత్స ఆలస్యం కావడం లేదా ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి రాకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులు పథకం నిబంధనల ప్రకారం ప్రమాద బాధితులకు పూర్తి బాధ్యతతో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. పథకం పరిధిలోకి వచ్చే చికిత్సకు సంబంధించి బాధితుల నుంచి నగదు కోరడం లేదా సేవలను నిరాకరించడం చేయకూడదని స్పష్టం చేశారు. పథకం అమలుపై ఆసుపత్రుల ప్రతినిధులతో పాటు ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రమాద బాధితులను వీలైనంత త్వరగా సమీపంలోని అర్హత కలిగిన నెట్‌వర్క్ ఆసుపత్రికి తరలించి, తక్షణ వైద్య సహాయం అందేలా ప్రజలు సహకరించాలని కోరారు. ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడటమే పీఎం రాహత్ పథకం ప్రధాన లక్ష్యమని, నెట్‌వర్క్ ఆసుపత్రులు దీనిని మానవతా దృక్పథంతో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డా. శ్రవణ్ బాబు, డీసీహెచ్ఎస్ డా. ఓ. మాధవి దేవి, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రఘునందన్, ఎన్టీఆర్ వైద్య సేవల జిల్లా కోఆర్డినేటర్ డా. జె. సుమన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, 51 నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశ్‌నగర్ డివిజన్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు



**బాలానగర్ ఆగస్టు 21**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రకాశ్‌నగర్ డివిజన్‌లో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్యామ్‌లాల్ బిల్డింగ్ సమీపంలోని ఎరుకల బస్తీ చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దర్గా కరుణాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర చైర్మన్ కమ్మ కార్పొరేషన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రిగా రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేం దుకు ఆయన ముందుచూపుతో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆధునిక భారతదేశ నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్న బండి రమేష్.. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హోసీ తోచర్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, రామాదేవి, ఎరుకల సురేష్, కొండ కిరణ్, పద్మారెడ్డి, పర్వేజ్, అలీ, గణేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతర వైద్య సేవలు

**రోగులకు సౌకర్యాల కల్పనపై ఆరా**

**న్యూ జీజీహెచ్ లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆకస్మిక తనిఖీ**

**విజయవాడ, ఆగస్టు 20, 2026** జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం రాత్రి న్యూ జీజీహెచ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర చికిత్స విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది అందుబాటు, రోగులకు సౌకర్యాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్యం అందేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోగులు, వారి సహాయకులకు ఆసుపత్రిలో అవసరమైన సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయి



...లేదా అనే అంశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముఖ్యంగా రోగులు, వారి బంధువులు వేచి ఉండే ప్రాంతాల్లో సీటింగ్ ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట అదనపు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, రోగులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో వైద్య సేవలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకుండా ఆసుపత్రి యంత్రాంగం తీసుకున్న చర్యలను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో అవసరమైన వైద్యం అందించడం అధికారుల ప్రథమ బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ రోగులు ఇబ్బందులు పడకూడదని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రఘునందన్, డా. ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా. జె.సుమన్ తదితరులు ఉన్నారు.

# యువరాజ్ సింగ్ కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ !

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ విజేత యువరాజ్ సింగ్ కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే మెంటార్‌గా ఆటగాళ్లకు దిశానిర్దేశం చేస్తున్న యువరాజ్ సింగ్.. ప్రొఫెషనల్ క్రికెట్‌లో అధికారికంగా ఇప్పటి వరకు కోచ్‌గా వ్యవహరించలేదు. అప్‌కమింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో యువరాజ్ సింగ్ కోచ్‌గా అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్ బాధ్యతలు చేపట్టబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే యువరాజ్ సింగ్ నియామక ప్రక్రియ పూర్తయిందని, ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే బాధ్యతలు స్వీకరిస్తాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2027 మినీ వేలంలో యువరాజ్ సింగ్ పాల్గొంటాడని తెలుస్తోంది. హెడ్ కోచ్‌గా యువరాజ్ సింగ్‌కు కళ్లు చెదిరే పారితోషకం ఇచ్చేందుకు ఢిల్లీ యాజమాన్యం సిద్ధమైందని సమాచారం. రూ. 9.5 కోట్ల భారీ వేతనంతో యువరాజ్ సింగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే ఓ కోచ్ అందుకున్న అత్యధిక పారితోషకం ఇదే కావడం విశేషం. ఇప్పటి వరకు రికీ పాంటింగ్ పేరిట ఈ రికార్డ్ ఉంది. పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్‌గా రికీ పాంటింగ్ రూ. 9 కోట్ల వేతనం అందుకుంటున్నట్లు సమాచారం. అతని తర్వాత స్టీఫెన్ ఫ్లెమింగ్ రూ. 7.5 కోట్లు, లక్నో సూపర్ జెయింట్స్ డైరెక్టర్‌గా జహీర్ ఖాన్ రూ. 5 కోట్లు, రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ రూ. 4.5 కోట్లు, ఆండీ ఫ్లవర్, జస్టిన్ లాంగర్ రూ. 4 కోట్ల చొప్పున వేతనం తీసుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ చరిత్రలోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేదు. యువరాజ్ సింగ్ పర్యవేక్షణలోనైనా ఆ ముచ్చట తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ జట్టు ఉంది. రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న రిషభ్ పంత్.. తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ సారథ్య బాధ్యతలు చేపడుతాడని ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఆరంభంలో మెరుగైన ప్రదర్శన చేసినా.. కీలక సమయంలో చేతులెత్తేసింది. 14 మ్యాచ్‌ల్లో 7 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో ఆరో స్థానంలో నిలిచింది.



# బీసీసీఐపై మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం



భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)పై మాజీ క్రికెటర్, 1983 ప్రపంచకప్ విన్నర్ కీర్తి ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్‌పై ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు వస్తున్నాయని, అతనిపై చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించాడు. జూనియర్ లెవెల్ క్రికెట్ సెలెక్షన్‌లో ఎంపికయ్యేందుకు మిథున్ మన్హాస్ ఏజ్ ఫ్రాడ్‌కు పాల్పడినట్లు జమ్మూ కశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ మాజీ జాయింట్ సెక్రటరీ సుదర్శన్ మెహతా ఆరోపించారు. మాజీ డీఎస్పీ అయిన సుదర్శన్ మెహతా.. మిథున్ మన్హాస్‌పై చర్యలు తీసుకోవాలని కోర్టును కూడా ఆశ్రయించారు. సబ్-జూనియర్, జూనియర్ విభాగాల్లోని నేషనల్ టోర్నీల ఎంపికకు అర్హత సాధించేందుకు మన్హాస్ రెండు వేర్వేరు పట్టిన తేదీలను సమర్పించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబర్ 3లోపు నివేదిక సమర్పించాలని జమ్మూలోని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ న్యూస్ క్లిప్‌ను ఎక్స్ వేదికగా షేర్ చేసిన కీర్తి ఆజాద్.. బీసీసీఐ ఏం చేస్తుందని విమర్శలు గుప్పించాడు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏం చేస్తోంది? ఏజ్ ఫ్రాడ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. మిథున్ మన్హాస్‌కు రెండు వేర్వేరు జన్మదిన తేదీలు ఉన్నాయి . ఒకటి బీసీసీఐలో నమోదైతే.. మరొకటి డీడీసీఏలో నమోదైంది. బీసీసీఐ తన సొంత అధ్యక్షుడిపై చర్యలు తీసుకుంటుందా?'అని అని కీర్తి ఆజాద్ ప్రశ్నించారు. కీర్తి ఆజాద్ పోస్ట్‌తో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. మాజీ దేశవాళీ క్రికెటర్ అయిన మిథున్ మన్హాస్ జమ్మూకశ్మీర్‌కు చెందినవాడు. జమ్మూకశ్వీర్ తరఫున కెరీర్ ప్రారంభించిన అతను ఆ తర్వాత న్యూఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణించినా.. టీమిండియా తరఫున ఆడే అవకాశం అతనికి రాలేదు. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో పలు హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించాడు. ఏజ్ క్రికెట్ కోసం తన బర్త్ డే డేట్‌ను 9/12/1977 పేర్కొన్న మిథున్ మన్హాస్.. ఢిల్లీకి ఆడే సమయంలో 12/10/1979గా పేర్కొన్నాడని ఆరోపణలు వస్తున్నాయి. క్రికెట్‌లో ఏజ్ ఫ్రాడ్‌ను తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఈ ఆరోపణలపై మిథున్ మన్హాస్ కానీ, బీసీసీఐ కానీ ఇప్పటి వరకు స్పందించలేదు.

# సచిన్‌తో పోల్చితే కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడు

**• సౌతాఫ్రికా**

**క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్**

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధానం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మోహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లీ రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లీ విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లీ ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై 51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 123 టెస్ట్‌ల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లీ సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లీ అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు.

విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ అడుగుజాడల్లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ కొనసాగుతున్నారని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్‌కు మంచి టెక్నిక్ ఉంది. అతను భారత జట్టుకు ఒక పెద్ద ఆస్తి.
కానీ విదేశాల్లో అతని సగటు కేవలం 34 మాత్రమే. ఈ విషయంలో అతను ఇంకా మెరుగవ్వాలి. క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోర్లు చేయాలి. కేవలం సెంచరీలే కాకుండా డబుల్ సెంచరీలు చేయాలి. ఎందుకంటే కొత్త బంతికి ఔటవ్వడం ఎప్పుడైనా జరగవచ్చు. కాబట్టి మెరుగైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మల్చాలి'అని డివిలియర్స్ సూచించాడు.





## శ్రీలంకతో రెండో టెస్ట్‌కు

# కుల్దీప్‌పై వేటు!!

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా ఆఖరి పోరుకు సన్నదమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా జరిగే రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్ తరహాలోనే కొలంబోలోనూ ఆధిపత్యం చెలాయించి 2-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో భారత్ ఉంది. తద్వారా డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటుంది. తొలి టెస్ట్‌లో భారత్ మూడు విభాగాల్లో సత్తా చాటింది. అయితే కుల్దీప్ యాదవ్ వైఫల్యం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో (1/65) ఒకే ఒక్క వికెట్ తీసిన కుల్దీప్ యాదవ్.. రెండో ఇన్నింగ్స్‌లో (0/37) ఒక్క వికెట్ పడగొట్టలేకపోయాడు. మరోవైపు మానవ్ సుతర్ 10 వికెట్లతో సత్తా చాటగా.. జడేజా నాలుగు వికెట్లు పడగొట్టాడు. దాంతో కుల్దీప్ యాదవ్‌పై విమర్శలు వస్తున్నాయి. అయితే కుల్దీప్ యాదవ్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అనగా.. అతి తక్కువ ఓవర్లు బౌలింగ్ చేసి ఎక్కువ పరుగులిచ్చాడని ఆకాశ్ చోప్రా తెలిపాడు. ఈ క్రమంలోనే రెండో టెస్ట్ నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించి అతని స్థానంలో డొమెస్టిక్ వెటరన్ స్పిన్నర్ సరాన్ష్ జైన్‌ను ఆడిస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే 33 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన భారత క్రికెటర్‌గా సరాన్ష్ జైన్ నిలవనున్నాడు. మరోవైపు భారత్ మూడో స్పిన్నర్‌తో ఆడాలనుకుంటే కుల్దీప్ యాదవ్‌ను కొనసాగించాలని అశ్విన్ సూచించాడు. ఆకాశ్ చోప్రా మాత్రం కుల్దీప్ యాదవ్ స్థానంలో సరాన్ష్ జైన్‌ను ఆడించవచ్చని అంచనా వేసాడు. మరి టీమ్‌మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. తొలి టెస్ట్‌లో ధ్రువ్ జురెల్ గాయపడ్డాడు. మూడో రోజు ఆటలో ఫీల్డింగ్ చేస్తుండగా.. అతని ఎడమ చీలమండకు గాయమైంది. దాంతో అతను మైదానం వీడగా.. సర్ఫరాజ్ ఖాన్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా మ్యాచ్‌లో కొనసాగాడు. ప్రస్తుతం అతని గాయాన్ని బీసీసీఐ మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తుందని తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే రెండో టెస్ట్‌కు ధ్రువ్ జురెల్ దూరం కానున్నాడు. అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. తొలి టెస్ట్‌లో జురెల్ హాఫ్ సెంచరీతో రాణించాడు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, జైస్వాల్ ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్ ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగనున్నాడు. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా మిడిలార్డర్‌లో ఆడనున్నారు. తొలి టెస్ట్‌లో విఫలమైన జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సత్తా చాటాల్సిన అవసరం ఉంది. మానవ్ సుతార్ స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఆడనుండగా.. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలో ఒకరికి రెస్ట్ ఇవ్వాలనుకుంటే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు. ఆకీబ్ నబీకి మరోసారి నిరాశే ఎదురవ్వనుంది. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు భారత్ తుది జట్టు(అంచనా) యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/ సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, సరాన్ష్ జైన్/కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ/గుర్నూర్ బ్రార్.

# క్వార్టర్‌ఫైనల్‌కు గాయత్రి-త్రీసా

**సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీ కూడా..**

**ప్రీ క్వార్టర్స్‌లో ఓడిన సింధు, ఆయుశ్**

**బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్**

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ సింగిల్స్‌లో పివి సింధు, ఆయుశ్ శెట్టి పోరాటం ప్రీ క్వార్టర్ ఫైనల్లో ముగియగా.. మహిళల, పురుషుల డబుల్స్‌లో భారత షట్లర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. ఈ జోడీలు సెమీస్‌కు చేరితే కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో గురువారం ఉత్కంఠభరితంగా సాగిన మహిళల సింగిల్స్‌లో సింధు 11-21, 21-15, 17-21తో 3వ సీడ్, చైనా షట్లర్ వాంగ్ చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి ఇండోనేషియాకు చెందిన 11వ సీడ్ అల్వీ ఫర్హాన్ చేతిలో 19-21, 11-21తో వరుస గేముల్లో ఓటమిపాలయ్యాడు. దీంతో తొలిరౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్ షి యూకీని ఓడించి సంచలనం సృష్టించిన ఆయుష్.. ప్రీ-క్వార్టర్ ఫైనల్‌లోనే తన ప్రయాణాన్ని ముగించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తానీసా కాస్ట్రో పోరాటం ముగిసింది. ప్రీ క్వార్టర్స్‌లో వీరు 16-21, 5-21తో 6వ సీడ్, చైనా షట్లర్ల చేతిలో చిత్తుగా ఓడారు.



### క్వార్టర్స్‌కు గాయత్రి, త్రీసా జోడీ...

మహిళల డబుల్స్‌లో గాయత్రీ గోపీచంద్-త్రీసా జోలీ జంట సంచలనం నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్లో ఏకంగా ఏడో సీడ్‌ను జంటను చిత్తుచేశారు. హోరాహోరీగా సాగిన ఈ గేమ్‌లో గాయత్రి-త్రీసా జంట 21-16, 21-12తో జపాన్‌కు చెందిన కీ నకనిశి జంటకు షాక్ ఇచ్చారు. తొలి సెట్‌ను 21-16తో నెగ్గిన భారత అమ్మాయిలు.. రెండో సెట్‌నూ 21-12తో సెట్‌ను గెలిచి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. ఆ తర్వాతి రౌండ్‌లో గాయత్రి-త్రీసా జంటకు నాలుగో సీడ్ జియా యీ ఫాన్ -- ఝాంగ్ షు గ్జియాన్(చైనా)తో గట్టి పోటీ ఎదురుకానుంది. ఇక పురుషుల డబుల్స్‌లో 5వ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట మూడుసెట్ల హోరాహోరీ పోరులో మలేషియా జంటను చిత్తుచేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ప్రీ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ 21-23, 21-19, 21-19తో మలేషియాకు చెందిన ఆరిఫ్-యాప్‌లను చిత్తుచేశారు.

శుక్రవారం,
ఆగస్టు 21, 2026
హైదరాబాద్
పీపుల్స్ న్యూస్
దినపత్రిక



# మ్యూజికల్ డ్రామా..జగమే సంగీతం

## అమెజాన్‌లో 4నుంచి వెబ్ సిరీస్




టాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. కర్ణాటక సంగీత సంప్రదాయాలను సమకాలీన శ్రుతులతో మేళవిస్తూ ఆయన అందించిన స్వరాలు ఈ కథకు ప్రాణం పోశాయని చెప్పవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో తెలుగుతో పాటు తమిళ డబ్బింగ్ వెర్షన్, ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. ఈ కథ విషయానికొస్తే.. కర్ణాటక సంగీత వారసత్వాన్ని కలిగిన కుటుంబం మరియు దాని మూలాల చుట్టూ ఈ సిరీస్ తిరుగుతుంది. తన తాత గారి సంగీత వారసత్వాన్ని కొనసాగించాలనుకునే బాలు అనే యువకుడు.. కుటుంబ బంధాలు, రహస్యాలు, సాంప్రదాయ కట్టుబాట్ల మధ్య ఎలా నలిగిపోయాడనేదే ప్రధానాంశం. తన కుటుంబం నిర్మించిన ప్రతిష్టను కాపాడుకుంటూనే, తనకంటూ ప్రత్యేకమైన కళాత్మక స్వరాన్ని ఎలా కనుగొన్నాడనే భావోద్వేగ ప్రయాణాన్ని ఇందులో చూపించనున్నారు. సంగీతంలోని భావోద్వేగ శక్తిని చాటిచెప్పే హృద్యమైన కథే 'జగమే సంగీతం' అని, సంప్రదాయం, ఆశయం వంటి అంశాలను ఇది అద్భుతంగా అన్వేషిస్తుందని తెలిపారు. అలాగే నిర్మాత సుష్మిత కొణిదెల మాట్లాడుతూ.. సంగీతం కేవలం ఒక కళ మాత్రమే కాకుండా, ఆ కుటుంబంలోని ప్రేమ, సంఘర్షణలను తెలిపే భావోద్వేగ భాషగా ఎలా మారుతుందో ఈ సిరీస్ ద్వారా చూపిస్తున్నామని పేర్కొన్నారు. అసాధారణ నటీనటులతో తెరకెక్కిన ఈ సంగీత భరిత ప్రయాణాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆస్వాదిస్తారని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

# 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన్'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.




# తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

## ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫోటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడికల్ డ్రామా 'రణబాలి' చిత్రంలో ఈ రియల్ లైఫ్ కపుల్ ఆన్ స్క్రీన్‌పై జంటగా నటిస్తున్నారు.

-----------------

# రామ్ చరణ్ అన్నతో సినిమా చేయాలని ఉంది : వరుణ్ తేజ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తన సోదరుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి వెండితెరను పంచుకోవాలన్న తన ఆకాంక్షను వెల్లడించారు. ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆయన, ఆ సంతోషాన్ని పంచుకుంటూ తన కెరీర్, భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గత ఐదేళ్లుగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో కొంత ఒత్తిడికి లోనయ్యానని, అయితే 'కొరియన్ కనకరాజు' చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన ఆదరణతో ఇప్పుడు ఎంతో ఊరటగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. కేవలం ఒకే తరహా జోనర్‌లకు పరిమితం కావడం తనకు ఇష్టం ఉండదని, నటుడన్నవాడు ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయాలని తాను నమ్ముతానని చెప్పారు. కరోనా అనంతర కాలంలో ఓటీటీ ప్రాధాన్యత పెరిగినప్పటికీ, థియేటర్‌లకు వచ్చే ప్రేక్షకులకు ఒత్తిడిని దూరం చేసేలా స్వచ్ఛమైన వినోదాన్ని అందించడం ఎంతో కీలకమని తాను గ్రహించినట్లు వివరించారు. త్వరలో విడుదల కానున్న స్పోర్ట్స్ డ్రామా 'బరి' గురించి ప్రస్తావిస్తూ, గతంలో తాను చేసిన 'గని' చిత్రంలో అనేక అంశాలను జోడించడం వల్ల కొంత గందరగోళం ఏర్పడిందని, అయితే 'బరి' మాత్రం పూర్తి క్రీడా నేపథ్యంతో ఎంతో వాస్తవికంగా ఉంటుందని వరుణ్ తేజ్ భరోసా ఇచ్చారు. ఈ చిత్ర ఆలోచన తన సోదరి నిహారిక నుంచి వచ్చిందని తెలిపారు. దీనితో పాటు, ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఒక రొమాంటిక్ చిత్రానికి అంగీకరించానని, తన వయసుకు తగినట్లుగా ఉండే ఈ ప్రేమకథ విభిన్న శైలిలో ఉంటుందని వెల్లడించారు. రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ, "చరణ్ అన్నయ్య అగ్ర కథానాయకుడు. తన సినిమాల కోసం ఆయన పడే శ్రమను చూసి నేను ఎంతో స్ఫూర్తి పొందుతుంటాను. చరణ్ అన్నతో కలిసి ఒక సినిమా చేయాలన్నది నా కోరిక" అని తన మనసులోని మాటను బయటపెట్టారు. తాను చిత్ర పరిశ్రమలోకి దర్శకుడు కావాలనే లక్ష్యంతో అడుగుపెట్టానని, భవిష్యత్తులో ఆ దిశగా తప్పకుండా అడుగులు వేస్తానని వరుణ్ తేజ్ స్పష్టం చేశారు.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ కొత్త సినిమా టైటిల్ ఇదే..

విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న సినిమాకు టైటిల్ ఖరారైంది. ఇంతవరకు #VenkyAnil5, #NKRAR2 పేర్లతో ప్రచారంలో ఉన్న ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను మేకర్స్ ప్రకటించారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. షైన్ స్క్రీన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను ప్రత్యేక వీడియో ద్వారా ప్రకటించారు. ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు నివాళిగా 'అప్పుల అప్పారావు'లోని ఓ హాస్య సన్నివేశాన్ని గుర్తు చేస్తూ వీడియోను మొదలుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణ తనకు స్ఫూర్తి అని అనిల్ రావిపూడి పలు సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే. వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతిశెట్టి కలిసి అనిల్ రావిపూడిని సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. అందుకు ఆయన ఎలాంటి తడబాటు లేకుండా 'జనవరి 12 విడుదల' అని చెబుతారు. దీంతో నటీనటులు కాసేపు అయోమయానికి గురవుతారు. తాము విడుదల తేదీ గురించి కాదు.. టైటిల్ గురించి అడిగామని చెబుతారు. చివరికి అదే సినిమా టైటిల్ అని అనిల్ వెల్లడించడంతో వీడియో ముగుస్తుంది. కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. సినీ పరిశ్రమలో ఆయన 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పోస్టర్‌ను తీసుకొచ్చారు. ఇందులో లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్‌రెడ్డిగా వెంకటేశ్ కనిపించారు. భారత సైన్యంలో పనిచేసే ఈ అధికారి కౌంటర్ టెర్రరిజం, బందీలను రక్షించే కార్యకలాపాల్లో నిపుణుడిగా ఉంటారని పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఆర్మీ దుస్తుల్లో, సన్‌గ్లాసెస్‌తో, ఓ కారు పక్కన వెంకటేశ్ కనిపించిన తీరు ఆకట్టుకుంది. వెంకటేశ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్‌కు కృతిశెట్టి జంటగా కనిపించనున్నారు. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌తో పాటు అనిల్ రావిపూడి మార్క్ వినోదం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. సమీర్‌రెడ్డి కెమెరామెన్, తమ్మిరాజు ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు.




# రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల




'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెళ్లవే పేదరికం.. ఇక్కడే
ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.

# మమితా బైజు .. మరో మూవీతో సిద్ధం



'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com